## క్లుప్తంగా

### స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్‌ను విజయవంతం చేయాలి

**గాంధీనగర్(విజయవాడసెంట్రల్):** స్వచ్ఛాంధ్ర, హరితాంధ్ర, ఆరోగ్య ఆంధ్ర లక్ష్యంగా అమలుచేస్తున్న స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతోందని.. ప్రతి నెలా మూడో శనివారాన్ని స్వచ్ఛాంధ్ర–స్వచ్ఛ దివస్‌గా గుర్తించినందున ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. ఈ నెల 15వ తేదీ మూడో శనివారం స్వచ్ఛాంధ్ర–స్వచ్ఛ దివస్ సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై కలెక్టర్ లక్ష్మీశ జిల్లాస్థాయి అధికారులు, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు తదితరులతో కలెక్టరేట్ నుంచి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి నెలా ఒక ఇతివృత్తంతో స్వచ్ఛాంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతోందని.. ఈ నెల కూడా సోర్స్ – రిసోర్స్ ఇతివృత్తంతో కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున నియమ నిబంధనలు అనుసరించి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞను చేయించాలని సూచించారు. కార్యక్రమం వివరాలను స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. కార్యాలయాల్లోనూ స్వచ్ఛతా కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. టెలీకాన్ఫరెన్స్‌లో విజయవాడ నగరపాలకసంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్‌ఎం, డీపీఓ పి.లావణ్య కుమారి, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, విజయవాడ ఆర్డీఓ కావూరి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

### దోమల నియంత్రణకు చర్యలు



సాక్షి ఎఫెక్ట్

**మధురానగర్(విజయవాడసెంట్రల్):** విజయవాడ నగరపాలకసంస్థ అధికారులు స్పందించారు. నగరంలో దోమలు పెరిగిపోతుండటంతో ప్రజలు పడుతున్న అవస్థలపై సాక్షి దిన పత్రికలో శుక్రవారం దోమలు.. బాబోయ్ దో మలు శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన మలేరియా విభాగం అధికారులు దోమల నియంత్రణకు చర్యలు చేపట్టారు. ఖాళీ స్థలాల్లో నిలిచిన నీటిలో గంబూసియా చేపలు వేయటంతో పాటు మురుగు నీటి నిల్వల్లో ఆయిల్‌బాల్స్ వేశారు. అలాగే మురుగు కాలువల్లో దోమల నివారణ మందులు స్ప్రే చేశారు. దోమల నియంత్రణకు చేపట్టే చర్యలకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మలేరియా ఇన్‌స్పెక్టర్ అనిల్, సూ పర్‌వైజర్ బెనర్జీ పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**గాంధీనగర్(విజయవాడసెంట్రల్):** సూర్యారావుపేట సెక్షన్, చుట్టుగుంట సబ్ స్టేషన్ 11 కేవీ సీతారామపురం ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ పనుల నిమిత్తం శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ ఈఈ రవీంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాలాంధ్ర ప్రెస్, విశాలాంధ్ర ప్రెస్ రోడ్, బోయపాటి వారి వీధి, శ్రీనివాసరావు వీధి, నేతాజీ వీధి, బారిస్టర్ వారి వీధి, బంకపల్లి వారి వీధి, పాపయ్య వీధి, స్వాతి ప్రెస్ ఏరియా, కడియాల వారి వీధి, బెల్లపు శోభనాద్రి వీధి, చలసాని వెంకట కృష్ణయ్య వీధి, కోవెలమూడి వారి వీధి, ఎంజే నాయుడు హాస్పిటల్ ఏరియా, దాసరి వారి వీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

### రూ.32 లక్షల మెటీరియల్ మాయంపై కేసు నమోదు

**మధురానగర్(విజయవాడసెంట్రల్):** రూ.32 లక్షల విలువైన మెటీరియల్ మాయమైన ఘటనపై గుణదల పోలీసులు కేసు నమోదు చేశారు. తమ కంపెనీలో పనిచేసే ఆడిటింగ్ ఇన్‌ఛార్జి ఆఫీసర్ బోయిన మన్మథరావు రూ.32 లక్షల విలువైన మెటీరియల్‌ను కంపెనీ అనుమతి లేకుండా ఇతర కంపెనీలకు పంపించారంటూ గుణదల పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం యూసెన్ లాజిస్టిక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ డెప్యూటీ మేనేజర్ గొట్టిపల్లి శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుణదల కార్మెల్ నగర్‌లోని యూసెన్ లాజిస్టిక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో మన్మథరావు ఆడిటింగ్ ఇన్‌చార్జిగా పనిచేస్తున్నారు. ఈయన కంపెనీ అనుమతులు లేకుండా ఆన్‌లైన్ ద్వారా ఇతర కంపెనీలకు రూ.32 లక్షల మెటీరియల్‌ను మోసపూరితంగా పంపించారు. ఇటీవల కంపెనీలో నిర్వహించిన ఇంటర్నల్ ఆడిట్‌లో ఈ మోసం వెలుగులోకి వచ్చింది. దీనిపై విచారణ నిర్వహించి తగు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. గుణదల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### 19న కేబీఎన్‌లో 'మస్త్ - 2025'

**వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):** విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు తమ కళాశాల పీజీ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీన 'మస్త్' (మేనేజ్‌మెంట్ ఆప్టిట్యూడ్ స్కిల్స్ టెస్ట్) రాష్ట్రస్థాయి సాంస్కృతిక మహోత్సవం నిర్వహించనున్నట్లు కేబీఎన్ కళాశాల కార్యదర్శి టీ శ్రీనివాసు తెలిపారు. శుక్రవారం ఈ పోటీలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. మరిన్ని వివరాలకు 98857 666 76 నంబరులో సంప్రదించాలని సూచించారు.

# నడిరోడ్లే.. వేడుకలకు వేదికలు !

- 57వ డివిజన్‌లో కల్యాణ మండపాలు లేక ప్రజల అవస్థలు
- రెండున్నర దశాబ్దాల నుంచి ఆచరణకు నోచుకోని వైనం

**అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):** అక్కడ పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలు జరుపుకోవాలన్నా.. ఏదైనా వేడుకలు చేసుకోవాలన్నా వారికి నడి రోడ్లే శరణ్యం.. పేరుకు రెండున్నర దశాబ్దాల చరిత్ర ఉన్న పేట అయినా.. ఇక్కడ కల్యాణమండపం కాదు కదా.. కనీసం కమ్యూనిటీ హాలు కూడా లేదు. దీంతో ఈ ప్రాంత ప్రజలు ఏ వేడుకలు జరుపుకోవాలన్నా వారికి నడి రోడ్లే వేదికలుగా మారుతున్నాయి. స్థానిక 57వ డివిజన్ న్యూరాజరాజేశ్వరీపేటలోని పరిస్థితి ఇదీ.



న్యూ రాజరాజేశ్వరీపేట ప్రాంతం

**ఎంత మందికి మొత్తుకున్నా.. ఆచరణకు నోచుకోలేదు..**

న్యూరాజరాజేశ్వరీపేటలో దాదాపు 15 వేల మందికి పైగా జనాభా జీవిస్తున్నారు. నిరుపేద, సామాన్య, మధ్యతరగతి ప్రజలు అధికంగా ఉండే డివిజన్ కావడంతో ప్రభుత్వ పెద్దలు ఎప్పుడూ ఈ డివిజన్‌పై చిన్నచూపు చూస్తూనే ఉంటారు. ఇక్కడ ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంలో కూడా అలసత్వం వహిస్తుంటారు. ఇదే విధంగా ఇక్కడి ప్రజలు శుభకార్యాలు జరుపుకునేందుకు తమకు కల్యాణ మండపం కావాలని.. కమ్యూనిటీ హాలునైనా నిర్మించాలని పదే పదే స్థానిక పాలకులను మొత్తుకున్నా ఒక్కరూ కూడా దీని గురించి పట్టించుకోలేదు. గతంలో రెండు ప్రదేశాలలో కల్యాణ మండపం నిర్మించాలని ఆలోచనలు చేసినప్పటికీ అందులో ఒకటి పోలీస్‌స్టేషన్‌కు పోగా మరొక్కటి చేపల మార్కెట్‌కు వెళ్లిపోయింది. ఆ తరువాత ఈ ప్రాంతంలో కల్యాణ మండపం ఊసేనే పాలకులు మరచిపోయారు.

**ఆనంద వేళల్లో.. కన్నీళ్లు..**

ఈ ప్రాంతంలో ఏ శుభకార్యాలు జరుపుకోవాలన్నా స్థానిక ప్రజలు నడిరోడ్లనే ఆశ్రయిస్తారు. వాతావరణం సహకరించడం.. స్థానికుల నుంచి అభ్యంతరాలు రాకపోతేనే అవి సజావుగా జరుగుతాయి. లేకపోతే ఆ వేడుక సమయంలో ఏదైనా వర్షం పడినా... ఎవరైనా రోడ్లపై వేడుకలు ఎలా జరుపుకుంటారని అభ్యంతరాలు తెలిపి గొడవలకు దిగినా ఇక ఆనందంతో.. కేరింతలతో ఉండాల్సిన ఆ వేడుక అంతా కన్నీటిమయంగా మారుతుంది. అకాల వర్షం వస్తే వారు వేల రూపాయలు వెచ్చించి వేసుకున్న మండపాలన్నీ తడిచిపోవడం.. ఆహారం మిగిలిపోయి నష్టపోవడం ఇక్కడ నిత్యకృత్యంగా కనిపిస్తుంటాయి.

**అందరికీ మేలు..**

న్యూ రాజరాజేశ్వరీపేటలో కల్యాణ మండపం నిర్మాణం జరిగితే డివిజన్‌లో ప్రజలందరికీ ఎంతో మేలు కలుగుతుంది. పేరు గొప్ప ఊరు దిబ్బ అనే చందంగా ప్రభుత్వ స్థలాలు.. భూములు ఈ పేటలో ఎక్కువగానే ఉన్నప్పటికీ ప్రభుత్వం ఈ ప్రాంతంలో కల్యాణ మండపాలు నిర్మించేందుకు ఆలోచనలు చేయడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి ఈ ప్రాంతంలో నూతన కల్యాణ మండపాన్ని నిర్మించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

**ప్రజల చిరకాల కోరిక నెరవేర్చాలి..**



గత 25 సంవత్సరాల నుంచి ఈ పేటలోనే ఉంటున్నాం. ఇక్కడ కల్యాణ మండం నిర్మించుకోవాలనేది స్థానిక ప్రజల చిరకాల కోరిక. కల్యాణ మండపం, కమ్యూనిటీ హాల్ లేకపోవడం వల్ల ఏదైనా కార్యక్రమాలు జరుపుకోవాలంటే చాలా ఇబ్బందిగా ఉంటుంది. కల్యాణ మండపం నిర్మాణం జరిగితే ప్రజలందరికీ మేలు జరగడంతో పాటు ప్రభుత్వానికి ఆదాయం కూడా వస్తుంది.

– మల్లల చెన్నకేశవరెడ్డి, స్థానికుడు

**వేడుకలు చేసుకోవాలంటే అనేక ఇబ్బందులు..**



న్యూ ఆర్ఆర్‌పేట, అమరావతి కాలనీ, సుందరమ్మ దిబ్బ ప్రాంతాల్లో 15 నుంచి 20 వేల మంది జనాభా ఉన్నాం. మా ఇళ్లల్లో ఏవైనా వేడుకలు చేసుకోవాలంటే రోడ్లపైనే చేసుకోవాల్సి వస్తోంది. వర్షాలు పడినా.. పోలీసుల నుంచి పర్మిషన్లు రాకపోయినా ఆ వేడుకలు సక్రమంగా జరగవు. ప్రజలు అన్ని విధాలుగా నష్టపోతుంటారు. ప్రభుత్వం ఈ పేటలో కల్యాణ మండపాన్ని నిర్మించాలి.

– నెల్లి గోవింద్‌నాయుడు, స్థానికుడు.

# పార్కుల్లో సౌకర్యాలు పెంచాలి

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర



వెటర్నరీ కాలనీలోని పార్కులో సమస్యలు తెలుసుకుంటున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

**పటమట(విజయవాడతూర్పు):** పార్కుల్లో వ్యాయామం చేసేవారికి సౌకర్యాలను మరింత మెరుగుపరచాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. టిక్కిల్ రోడ్డు, మదర్ థెరిస్సా జంక్షన్, వెటర్నరీ కాలనీ ప్రాంతాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. కాలనీల్లోని పార్కులను సందర్శించి అక్కడికి వచ్చిన వారితో మాట్లాడి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పార్క్‌లో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని పెంచేందుకు మరమ్మతులు పూర్తి చేసి ప్రజలకు వెంటనే అందుబాటులోకి తేవాలని అధికారులను ఆదేశించారు. ఎన్టీఆర్ కమ్యూనిటీ హాల్లో ఉన్న ప్లే గ్రౌండ్ పరిశీలించి, ప్రజలు ఆడుకునేందుకు వీలుగా మరమ్మతులు చేయాలని సూచించారు. అనంతరం ఆయన టిక్కిల్ రోడ్, మదర్ థెరిస్సా జంక్షన్ ప్రాంతాలను పర్యటించి పారిశుద్ధ్య నిర్వహణ తీరు తనిఖీ చేశారు. డ్రెయిన్‌లలో పూడికలను ఎప్పటికప్పుడు తీయాలని ఇంజినీరింగ్, ప్రజారోగ్యం విభాగం అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న నిర్మాణ వ్యర్థాలను చూసి వాటిని వెంటనే తొలగించాలని, సంబంధిత భవన నిర్మాణ యజమానులకు నోటీసులు అందించాలని చెప్పారు. రోడ్డు మీద ఉన్న పాత వాహనాలను పోలీసువారి సమన్వయంతో ట్రాఫిక్ అంతరాయం లేకుండా తరలించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ పర్యటనలో చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్వీ ప్రసాద్, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, ఎస్ఈ (ప్రాజెక్ట్) పి.సత్యకుమారి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

# క్రీడల అభివృద్ధి మా బాధ్యత



బంగారు పతకం సాధించిన క్రీడాకారులను సన్మానించిన పూర్వ విద్యార్థులు

**విజయవాడస్పోర్ట్స్:** పాఠశాలలో ఆటల అభివృద్ధికి నిధులు సమకూర్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, కేబీసీ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు కోనేరు కుమార్(ఎన్ఆర్ఐ), కె.వీరాజీ, సీహెచ్ వెంకటేశ్వరరావులు వెల్లడించారు. ఇటీవల జరిగిన జాతీయ స్కూల్ గేమ్స్ సపక్ తక్రా పోటీల్లో పటమట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు బంగారు పతకం సాధించిన విషయం తెలిసిందే. ఈ జట్టును పూర్వ విద్యార్థులు పాఠశాల ఆవరణలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాల విద్యార్థులు సాధించిన బంగారు పతకం గురించి తెలుసుకుని ఎంతో సంతోషించామన్నారు. చదువుతో పాటు ఆటలు ఎంతో అవసరమని, క్రీడలు బంగారు భవిష్యత్తుకు పునాదులు వేస్తాయని, క్రీడల్లో నైపుణ్యం సాధిస్తే అనేక ఉద్యోగ అవకాశాలు వస్తాయని చెప్పారు. పాఠశాలలో క్రీడల అభివృద్ధికి అవసరమైన వనరుల కల్పనకు ఎంత వ్యయమైనా తాము సమకూరుస్తామని హామీ ఇచ్చారు. అనంతరం జాతీయ పోటీల్లో పతకాలు సాధించిన వి.కావ్య, రిహానోమా, కె.లావణ్య, వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్.రమేష్‌లను సన్మానించారు.

# ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన



ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయ వస్తువులను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

**పటమట(విజయవాడతూర్పు):** సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఒకసారి వాడి పడేసే ప్లాస్టిక్ వస్తువులు, దాని ప్రత్యామ్నాయంగా పర్యావరణ హితమైన వస్తువులు చూపించే ప్రత్యేక స్టాల్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పర్యావరణహితమైన వస్తువులే వాడాలని, ఒకసారి వాడి పడేసే ప్లాస్టిక్ వస్తువుల వల్ల పర్యావరణానికి హాని కలుగుతుందని చెప్పారు. ప్రజలకు అవగాహన కల్పించే విధంగా ప్రతి సర్కిల్లో స్టాళ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఒకసారి వాడి పడేసే ప్రతి ప్లాస్టిక్ వస్తువుకు ప్రత్యామ్నాయలు చూపిస్తూ సిబ్బంది, ప్రజలకు అవగాహన కల్పించే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం స్క్రూ గేజ్‌తో ప్లాస్టిక్ కవర్లను కొలిచి చూశారు. 120 మైక్రాన్ల కంటే తక్కువగా ఉన్న సింగిల్ యూస్ ప్లాస్టిక్ వస్తువులు భూమిలో కలవకుండా పర్యావరణానికి హాని కల్పించేవని, ప్రజలకు అర్థమయ్యే రీతిలో అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, శానిటరీ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అందుబాటులోకి రానున్న వాకింగ్, సైకిల్ ట్రాక్‌లు



పాయకాపురంలో విద్యుత్ స్తంభాలను తొలగిస్తున్న సిబ్బంది

**పాయకాపురం(విజయవాడరూరల్):** గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రూ.3.65 కోట్లతో ప్రజల సౌకర్యార్థం నిర్మించిన వాకింగ్ ట్రాక్, సైకిల్ ట్రాక్ త్వరలోనే అందుబాటులోకి రానున్నాయి. విజయవాడ – నూజివీడు ఆర్అండ్‌బీ రహదారిలో పైపుల రోడ్డు నుంచి కండ్రిక జంక్షన్ వరకు రోడ్డుకు ఆనుకొని సుమారు కిలోమీటరన్నర పొడవున పక్క పక్కనే రెండు ట్రాక్‌లను నిర్మించారు. విజయవాడ నగరంలో ఎక్కడా లేని విధంగా మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు 15వ ఆర్థిక సంఘం ఎయిర్ క్వాలిటీ నిధులు మూడు కోట్ల 65 లక్షల రూపాయలతో ప్రయోగాత్మకంగా రెండు ట్రాక్‌లను నిర్మింపజేశారు. ప్రధాన రహదారిపై వాహనాలు, సైకిల్ ట్రాక్‌లో సైకిళ్లు, మోటారు సైకిళ్లు, వాకింగ్ ట్రాక్‌లో ప్రజలు నడవటం వలన ప్రమాదాలు తగ్గేందుకు అవకాశం ఉంటుంది. అయితే రెండు ట్రాక్‌ల మధ్యలో విద్యుత్ స్తంభాలు ఉన్నాయి. విద్యుత్ స్తంభాలు తొలగించాలని విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ 6 లక్షల రూపాయలు విద్యుత్ సంస్థకు చెల్లించింది. విద్యుత్ స్తంభాలను తొలగించడంపై విద్యుత్ సంస్థ కాలయాపన చేసిందనే ఆరోపణలు ఉన్నాయి. శుక్రవారం విద్యుత్ స్తంభాలను తొలగించే పనులు జరుగుతున్నాయి. రెండు రోజుల్లో వాకింగ్ ట్రాక్, సైకిల్ ట్రాక్‌లు ప్రజలకు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

## బీసీ రిజర్వేషన్లలోని అశాస్త్రీయతను తొలగించాలి



మాట్లాడుతున్న బీసీ ఐక్య వేదిక నాయకులు

**గాంధీనగర్(విజయవాడసెంట్రల్):** ఏపీలో బీసీ రిజర్వేషన్ల అమలులో ఉన్న అశాస్త్రీయత వల్ల బీసీలకు తీవ్రమైన అన్యాయం జరుగుతోందని బీసీ ఐక్యవేదిక రాష్ట్ర చైర్మన్ ఎర్రాకుల తులసీరామ్ యాదవ్ అన్నారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీసీలకు విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థలు, నామినేటెడ్ పోస్టుల్లో 34 శాతం రిజర్వేషన్లను జనాభా ప్రాతిపదికన శాస్త్రీయంగా ఒకే విధానంలో అమలు చేయాలన్నారు. ద్వంద్వ నీతికి, విధానాలకు ప్రభుత్వం సత్వరమే స్వస్తి పలకాలని హితవు పలికారు. విద్య, ఉద్యోగాల్లో మాదిరిగానే స్థానిక సంస్థలు, నామినేటెడ్ పోస్టుల రిజర్వేషన్లలో కూడా బీసీ వర్గీకరణను అమలు చేయాలన్నారు. అత్యంత వెనుకబడిన వర్గాలైన ఎంబీసీలకు మేలు జరిగేలా సమన్యాయం చేయాలని కోరారు. అశాస్త్రీయమైన విధానాల వల్ల ఎంబీసీలు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్‌జేఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని ఆయా సంఘాల ప్రతినిధులు పిలుపునిచ్చారు. వర్కింగ్ చైర్మన్ జంగాల సింగరయ్య యాదవ్, కన్వీనర్ దానా గౌడ్, చెవుల కృష్ణాంజనేయులు, రావి శ్రీనివాస్, జి.నవజీవన్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు లక్ష్యసాధనకు కృషి చేయాలి



**వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):** విద్యార్థులు లక్ష్యసాధనకు పాటుపడాలని జేఎన్‌టీయూ(కాకినాడ) స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి డాక్టర్ జి.శ్యామ్‌కుమార్ అన్నారు. నగరంలోని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జున రావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ వార్షిక క్రీడా దినోత్సవం ఆ కళాశాల ఆవరణలో శుక్రవారం సందడిగా జరిగింది. ఈ సందర్భంగా కళాశాలలో నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. తొలుత కళాశాల కబడ్డీ ఫైనల్ పోటీలను అతిథుల చేతుల మీదుగా ప్రారంభించారు. అలాగే అంతర్ కళాశాలల పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు. అనంతరం డాక్టర్ శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు తాము ఎంచుకున్న రంగాల్లో విజయాలను సాధించేందుకు నిరంతర శ్రమ అవసరమన్నారు. పొట్టిశ్రీరాములు కళాశాల విద్యార్థులు వివిధ క్రీడాంశాల్లో విశ్వవిద్యాలయానికి సైతం పేరుప్రఖ్యాతలు తీసుకొచ్చారని కొనియాడారు.

**విద్యార్థి దశ కీలకం..**

బహుమతులు ప్రదానం చేసిన హాస్యనటుడు ఆకెళ్ల గోపాలకృష్ణ మాట్లాడుతూ మానవ జీవితంలో విద్యార్థి దశ చాలా కీలకమన్నారు. విద్యార్థులు చదువుతో పాటుగా క్రీడల్లోనూ రాణించాలని, అప్పుడే ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవచ్చని వివరించారు. కళాశాల కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్, కళాశాల కమిటీ ప్రముఖులు పొట్టి సురేంద్రకుమార్, చిట్టూరి ఆనంద రామసుధాకర్, గ్రంధి పవన్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ శరవణకుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ పతంజలిశాస్త్రి, డాక్టర్ కె.సురేష్, ఫిజికల్ డైరెక్టర్ ఎం.విక్టర్, అధ్యాపకులు డాక్టర్ ఎస్.మణికంఠ, డాక్టర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శప్రాయుడు దామోదరం సంజీవయ్య



దామోదరం సంజీవయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మల్లాది విష్ణు, నాయకులు



దామోదరం సంజీవయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఎంహెచ్‌ఓ సుహాసిని

**మధురానగర్(విజయవాడసెంట్రల్):** నీతి, నిజాయతీ, నిరాడంబరత్వం, ఉన్నత విలువలకు మారుపేరైన దామోదరం సంజీవయ్య అందరికీ ఆదర్శప్రాయుడని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి దళిత ముఖ్యమంత్రి దివంగత దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా ఆంధ్రప్రభ కాలనీలోని జనహిత సదనంలో శుక్రవారం సంజీవయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. రాష్ట్ర ప్రప్రథమ దళిత ముఖ్యమంత్రి సంజీవయ్య జాతికి చేసిన సేవలను గుర్తు చేశారు. చిన్న వయసులోనే ముఖ్యమంత్రి పదవిని అలంకరించిన ఘనత సంజీవయ్యకే దక్కిందన్నారు. వితంతువులు, వృద్ధులకు పింఛన్ ఇచ్చే విధానాన్ని సంజీవయ్య ప్రవేశపెట్టారన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిని అరికట్టడానికి ఏసీబీ వ్యవస్థను దేశంలోనే మొట్టమొదటిసారిగా ఏపీలో స్థాపించారన్నారు. కార్యక్రమంలో నాయకులు దోనేపూడి శ్రీనివాసరావు, కొండా మహేశ్వర్ రెడ్డి, నందెపు సురేష్, బందారు అంజి, కోలంటి రవి, సామంతకూరి దుర్గారావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

**దామోదరం సంజీవయ్య సేవలు ఎనలేనివి**

**లబ్బీపేట(విజయవాడతూర్పు):** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా దామోదరం సంజీవయ్య బడుగు, బలహీనవర్గాలకు అందించిన సేవలు ఎనలేనివని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని అన్నారు. నగరంలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో శుక్రవారం దామోదరం సంజీవయ్య జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుహాసినితో పాటు, పలువురు ఉద్యోగులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డాక్టర్ సుహాసిని మాట్లాడుతూ.. రాష్ట్రంలో విప్లవాత్మక మార్పులను శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమంలో డీపీఎంఓ డాక్టర్ నవీన్, వైద్యులు కార్తీక్, బాలాజీ, డెప్యూటీ డెమో డాక్టర్ ప్రభాకరరెడ్డి పాల్గొన్నారు.

**సర్వేలో అవాంతరాలు అధిగమించండి..**

జిల్లాలో నిర్వహిస్తున్న ఎన్‌సీడీ–సీడీ సర్వేలో ఎదురవుతున్న సాంకేతిక అవాంతరాలను అధిగమించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ సుహాసిని సిబ్బందిని ఆదేశించారు. సర్వే జరుగుతున్న తీరును శుక్రవారం ఆమె జిల్లాలోని పలు ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా చంద్రాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మైలవరం 1 సచివాలయం ఏరియాలో ఇంటింటికీ వెళ్లి సర్వేను పరిశీలించారు. అనంతరం పాఠశాలలను సందర్శించి డీ వార్మింగ్ మాత్రలు ఎంత మంది వేసుకున్నారు, మధ్యాహ్న భోజనంలో నాణ్యతను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అక్కడి పిల్లల ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. ఇబ్రహీంపట్నం ఖిల్లా ఏరియాలో జరుగుతున్న డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించారు. పలువురు వైద్యాధికారులు పాల్గొన్నారు.

# హెల్మెట్ పెట్టు.. చాక్లెట్ పట్టు



వాహనదారుడికి అవగాహన కల్పిస్తున్న డీటీసీ మోహన్, పోలీస్ అధికారులు

**విజయవాడస్పోర్ట్స్:** హెల్మెట్ ధరించడం భారంగా కాకుండా బాధ్యతగా భావించాలని జిల్లా రవాణా కమిషనర్ ఎ.మోహన్ వాహనచోదకులు సూచించారు. రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా ఎంజీ రోడ్డులో హెల్మెట్ పెట్టు.. చాక్లెట్ పట్టు అనే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. హెల్మెట్ ధరించిన వాహన చోదకులకు చాక్లెట్‌లు పంచారు. ధరించని వారికి హెల్మెట్ ఆవశ్యతలను రవాణా అధికారులు వివరించారు. ఈ సందర్భంగా డీటీసీ మోహన్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులందరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించి, తమ విలువైన ప్రాణాలు కాపాడుకోవాలన్నారు. డ్రైవింగ్ సమయంలో హెల్మెట్ ధరించకపోవడంతో రోడ్డు ప్రమాదాలకు గురైన వారిలో సంవత్సరానికి వందల సంఖ్యలో మృత్యువాత పడుతున్నారని గుర్తు చేశారు. హెల్మెట్లు అసౌకర్యాన్ని కలిగిస్తాయని, హెల్మెట్ పెట్టుకోవడం వల్ల జుట్టు ఊడిపోతుందనే అసంబద్ధ వాదనలను నమ్మొద్దని సూచించారు. మీరు ధరించే హెల్మెట్ మీ కుటుంబ సభ్యులను రక్షిస్తుందనే నిజాలను దృష్టిలో పెట్టుకోవాలన్నారు. హెల్మెట్ ధరించని వాహనదారులకు రోడ్లపైకి ప్రవేశం లేదని, అలాంటి వారిపై కేసులు నమోదు చేసి లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్టీవోలు ఆర్.ప్రవీణ్, కె.వెంకటేశ్వరరావు, ఎంవీఐలు వి.పద్మాకర్, ఎ.ఉదయశివప్రసాద్, డి.వి.రమణ, బి.శ్రావణి, గీతాంజలి, ప్రియదర్శిని, కె.వి.రవిగోపాల్, బి.ఉమామహేశ్వరరావు, లాజర్‌బాబు, రవాణాశాఖ ఉద్యోగుల సంఘం జోనల్ అధ్యక్షులు ఎం.రాజుబాబు, కార్యాలయ పరిపాలన అధికారులు సత్యనారాయణ, గవర్నమెంట్ నర్సింగ్ కాలేజ్ ఎన్.ఎ స్.ఎస్.కోఆర్డినేటర్ శ్రీదేవి, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## • చికెన్ మార్కెట్లు వెలవెల



బీఆర్టీఎస్ రోడ్డు సమీపంలో నిర్మానుష్యంగా ఉన్న చికెన్ దుకాణాలు



బీసెంట్ రోడ్డులో ఖాళీగా దర్శనమిస్తున్న చికెన్ షాపులు

బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్‌తో నగరంలో చికెన్ మార్కెట్లు వెలవెలబోతున్నాయి. నిత్యం మాంసాహార ప్రియులతో రద్దీగా ఉండే చికెన్ దుకాణాలు నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. దీంతో చికెన్ వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

## 'మ్యూజికల్ నైట్' ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీపీ రాజశేఖరబాబు

**భవానీపురం(విజయవాడపశ్చిమ):** ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో శనివారం నిర్వహించనున్న సినీ సంగీత దర్శకుడు తమన్ 'మ్యూజికల్ నైట్' కార్యక్రమ బందోబస్తు ఏర్పాట్లను శుక్రవారం సాయంత్రం నగర పోలీస్‌కమిషనర్ ఎస్.వి. రాజశేఖరబాబు పరిశీలించారు. కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఇతర ప్రముఖులు హాజరుకానున్న నేపథ్యంలో స్టేడియం పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన భద్రత, పటిష్ట బందోబస్తును క్షుణ్ణంగా పరిశీలించారు. ఎటువంటి లోపాలు లేకుండా సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని తగిన భద్రత చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ట్రాఫిక్ పరంగా సామాన్య ప్రజలు ఎక్కడా ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీసీపీలు గౌతమి శాలి, డాక్టర్ తిరుమలేశ్వరరెడ్డి, కేఎం మహేశ్వర రాజు, కేజీవీ సరిత, కృష్ణమూర్తినాయుడు, ఏడీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.